# లోకందృష్టిలో పాపం! మోహిని!!

రచన : జయంతి పాపారావు

మోహిని మోహనాకారి. అంగసౌష్టవం కల అతివ. చిఱునగవుమోముకల చేడియ, లతికాదృశమైన నడుముకల లలన, పద్మాలవంటి కన్నులుగల పడతి, సంపెంగ వంటి నాసికగల సుదతి, తుమ్మెదఱెక్కల లాంటి నల్లని నున్ననిజుట్టుగల తలోదరి. సృష్టికర్త ఆమెకు ఆ అందాన్ని యిచ్చేడు. ఆమె అదృష్టవంతురాలు.

మోహిని ఉన్నతవిద్య నభ్యసించింది. ఆమె కళాభిమానురాలు. చిత్రలేఖనము అంటే అతియిష్టం. ఆమె చదువుకొనేరోజుల్లో చిత్రలేఖనంలో ఎక్కువ శ్రద్ధచూపింది. పాపం! అమెకు ఆ కళ అంతగా అబ్బలేదు. అనేక చిత్రకళాప్రదర్శనాలకు వెళ్లుతూండేది. చిత్రలేఖకులతో చనువుగా మసలుతూండేది. ఆ కళాభిమానంచే చిత్రలేఖకులను గౌర వించి ఆదరిస్తుండేది.

ఆ మక్కువ మోహినిలో అలా జీవంగా నుండి వృద్ధిపొందుతూనే యుంది. ఆ కోర్కె ఆమెలో క్రొక్కారు మబ్బులా క్రమ్ముకొనే యుంది.

ఆమె రసికురాలు, చిత్రకళాప్రియురాలు! ప్రకృతి సౌందర్యాన్ని పరికించి, హసించి, పులకించే పద్ధతి.

యవ్వనంతోనిండిన జవ్వని శరీర వంపు సొంపులను తీర్చిదిద్దిన చిత్రం అంటే ఆమెకు ప్రాణం!

నిలువుటద్దంలో తనప్రతిబింబాన్ని చూచు కుంటూ, మందహాసాన్ని మలపిస్తూ, సొట్టలు వారిన తన నున్నని, సన్నని చెక్కిళ్ల సోయ గాన్ని, గులాబిరేకుల్లాంటి, తన అధరాల అందాన్ని, అందం - ఆనందం మూసాత్తే అని అడిగే అమె అక్షులనీ, వక్షస్థల, కంఠమధ్య కమ్మని మదవాసనలను జల్లే మదించిన ప్రదే శపు మృదుత్వాన్ని, కుచాల కౌమరుతనం, కచాలక్రమణికచూచి, ముచ్చటపడి, మురిసి పోయి, తన స్త్రీమూర్తిని చిత్రించి అ చిత్ర పటాన్ని....అబ్బ! ఆనందం పట్టలేక గట్టిగా నవ్వుకొనేది.

ఆరోజు పౌర్ణమి. మోహిని తన యింటి ముందు నూతిదగ్గర నిలబడింది. చంద్రకిర ణాలకాంతిలో నూతిని అని నిలచిన కొబ్బరి చెట్ల అకులు తళతళ త్రాచుపాముతోకలవలె మెరుస్తూ, సన్నగా గాలికి ఊగుతూ, యాల పాట పాడుతున్నాయ్!

మూర్తి మేడ మీద నుంచి మోహినిని చూచాడు. "అప్సరస" అని ఆనందం పట్ట లేక గట్టిగా అరచాడు. ఆమెను చిత్రించి, తన చిత్రకళయొక్క ప్రయోజనాన్ని పొందాలి! ఆ స్త్రీమూర్తిని చిత్రించి, ఆ అందాన్ని ఆరా ధించాలి అని మూర్తి అనుకున్నాడు.

మోహిని కొబ్బరిచెట్టునాని కొంచెము వాలుగా నిలబడి, కొబ్బరిచెట్ల ఆకులలోంచి సూటిగా చంద్రుని చూస్తూ తియ్యనికలలను కంటూంది. యవ్వనంతో నిండిన ఆమె అవ యవాల వంపులనూ, చల్లగాలికి స్వేచ్ఛగా వదిలిన ఆమె క్రిక్కిరిసిన చనుగవనూ, నైలాన్‌చీరలోంచి బిగువుగా కన్పిస్తున్న ఆమె అరటిదవ్వలలాంటి తొడలనూ, మూర్తి చక్కగా చిత్రించి, ఆనందాన్ని పట్టలేక తబ్బిబ్బై గట్టిగా నవ్వేసేడు!

మోహిని ఆ నవ్వువింది. ప్రక్కమేడవేపు చూసింది. మూర్తి ఆమెచిత్రాన్ని ఆమెకు చూపించాడు. మోహిని మురిసిపోతూ, కిల కిలా నవ్వుకుంటూ కురంగంలా గంతులు వేసుకుంటూ మూర్తిదగ్గరకువచ్చి, చిత్రాన్ని లొక్కునిచూస్తూ "ఇంత అందంగా ఉన్నానా" అనుకొని ఆనందపరవశురాలైంది మూర్తిని అభినందించి.

మూర్తి ఆమెను దగ్గరకుతీసుకొని మూగగా కళ్లలోకి చూసాడు. "పరస్త్రీ తల్లి సమాను రాలుకదూ?" అని చిరునవ్వునవ్వుతూ మూర్తి కళ్లలోకి చూసింది.

"అవును! నీ స్త్రీమూర్తిని చిత్రించి, నా చిత్రకళ ధన్యతపొందింది. నీవు చిత్రకళా కన్యవు, నీ చిత్రాన్ని చిత్రించి క్యాలండర్లుగా ముద్రణకు యిస్తాను. ఏ యింట్లో చూచినా, స్త్రీమూర్తి నా చిత్రకళను చాటుతూ ప్రజలకు సంతోషాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తుంది! క్యాలం డర్లుగా ముద్రిస్తేనే ప్రతివారికీ అందుబాటులో వుంటాయ్! నీకళాభిమానముకూడ చాటుతూ వుంటుంది" అని ప్రశ్నార్థకంగా చూసాడు. మోహిని తన రసజ్ఞత కళాభిమానంచేత అందుకు అంగీకరించింది.

మోహిని తన చిత్రాన్ని తన హృదయానికి చేర్చి దగ్గరగా నొక్కుకొని ముద్దుపెట్టుకొంది. తన చిరకాలపు కోర్కె తీరినందుకు చిఱు నవ్వు నవ్వింది.

మోహిని క్యాలండర్లు ప్రచారంలోకి వచ్చాయ్.

"తననగ్నశరీరాన్ని చిత్రింపజేసి, ప్రజలకు చూపించడానికి కులట ఎందుకు వెరుస్తుంది? సంసారస్త్రీ గనకనా?" అంటూందిలోకం!

"ఇదేమీ క్రొత్తవిషయంకాదు. చిన్నప్పటి నుంచీ దీనికి చిత్రాలపిచ్చే! ఓహో! అలా మొగాళ్లతోటి ఎప్పుడూ తిరుగుతూ, పిచ్చి బొమ్మలన్నీ గీయించుకొని తన గదినిండా వ్రేలాడుకట్టుకొనేది? ఆ మూర్తి లేడటే........ ఇంకేం మరీ!" అని కలకంఠీకుల కఠోరకలు షితకంఠాలు అమె కలుషిత అని కూస్తు న్నాయ్!

"యవ్వనం నాయనా! అది ఎంతపనైనా చేయిస్తుంది" అని ఒక తరహామనుష్యులు ఆమెను కాముకిగా గుర్తించారు.

"అందుకే అలి మర్కటంలా ఉండా లన్నారు" అని వడలిన శరీరం — ముదిరిన గడ్డంగల మనుష్యులు నొక్కి వక్కాణించి, ఆమెభర్తయెడ సానుభూతి చూపారు.

* * *

మోహిని అందాలరాణి! కళాప్రియురాలు! రసజ్ఞురాలు. ఆ పతివ్రతను లోకం అనేక విధాలుగా కల్పించి చెబుతూంది.

లోకందృష్టిలో....పాపం! మోహినీ!!

"లోకం గ్రుడ్డిది! నిజానిజాలు గ్రహించ లేదు. చీకటికోణాల్లో జరిగే దురంతాలను తెలుసుకోలేదు! తెలిసినా....చీకట్లోగదా! అని ఊరుకుంటుంది. బాహాటంగా సూర్య కాంతిలో సత్కార్యాన్నిచేస్తే, దాని మంచిని గ్రహించక, చెడ్డలు వేలుచెప్పి, కర్కశంగా దూషిస్తుంది. ఇదీ లోకంతీరు! ఇదీ లోకం దృష్టి!!" అని మోహిని నిశితంగా లోకంవైపు చూసింది.

"లోకంలో మంచివారూ త్యాగమూర్తులూ వున్నారు! దురంతాల్ని మాయడానికి కఠోర కుఠారధరులై వున్నారు! వాళ్లనివాసం సూర్య కాంతిలో........! వాళ్లచూపులతాపులు చీకటి కోణాల్లో!! అని ఆమె అశాభావాన్ని ప్రస్ఫుటం చేసింది. లోకంలో రసికులూ-కళాప్రియులు ఉన్నారు మోహిని అందాన్ని, అదరాన్ని చూసి మురిసిపోయారు. మూర్తి చిత్రకళను చూసి ముచ్చటించారు.

మోహినిమూర్తి చిత్రకళాకన్య!
నా కవితాకన్య!!
ఒక శిల్పి శిల్పకళా కన్య!!!

*